ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మయూరి పురస్కారాలతో కళాకారులు

బోట్‌క్లబ్‌: దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక బాలాత్రిపురసుందరి ఆలయంలో బాలాత్రిపుర సుందరి కూచిపూడి డాన్స్‌ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 83 మంది కళాకారులు గణేశస్తుతి, అదిగోఅల్లదిగో, ముద్దుగారే యశోద, శివస్తుతి, దుర్గాస్తుతికి శ్రీను, తిరుమల, రిజ్వానా, గాయత్రీ, రేణుక, శాంతి, షణ్ముఖ, జాహ్నవి, విజ్ఞసాయి, జాను, రూపానాయుడు, దేవిశ్రీ, ఝాన్సీలక్ష్మి, సామ చేసిన నృత్యాలు అలరించాయి. ఐదేళ్ల చిన్నారి మోక్ష చేసిన నాగిని నృత్యం ఆకట్టుకుంది. అకాడమీ చైర్మన్‌ బేతా సత్యనారాయణ వీరిని మయూరి పురస్కారాలతో సత్కరించారు.

కమనీయం.. ఏనుగుల సంబరం

- నేడే కరప దసరా వేడుకలు
- నిర్వహణకు భారీ ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణలో ఏనుగు వాహనం(ఫైల్)



హంస వాహనం(ఫైల్)

కరప: మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలు.. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఏనుగు, హంస వాహనాలు.. బ్యాండు మేళాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు.. బుట్టబొమ్మలు, లక్క గుర్రాలు.. ఇలాంటి విన్యాసాలతో కరపలో విజయదశమి సంబరం కన్నులపండువగా నిలుస్తుంది. లక్షలాది రూపాయల వ్యయంతో అంగరంగ వైభవంగా ఇక్కడ జరిపే విజయదశమి సంబరం జిల్లావ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీగా జనం తరలివస్తుంటారు. కరపలో సోమవారం జరగనున్న ఈ దసరా ఉత్సవంపై ప్రత్యేక కథనం..

సుమారు ఆరున్నర దశాబ్దాల క్రితం కలకత్తాలోని కాళికామాత ఉత్సవాల్లో నిజమైన ఏనుగులను అలంకరించి ఊరేగించడం చూసిన కరపకు చెందిన దొరలు.. ఏనుగుబొమ్మతో ఇక్కడి సంబరానికి అంకురార్పణ చేసినట్టుగా పెద్దలు చెబుతుంటారు. తొలుత గ్రామంలోని పల్లపువీధిలో వెదురుబద్దలు, అట్టముక్కలు తదితర వాటితో చిన్నపాటి ఏనుగు బొమ్మను తయారుచేసి ఉత్సవాన్ని నిర్వహించేవారు. అనంతర కాలంలో గ్రామంలోని మెరకవీధి, కొత్తపేట, బీసీవీధి, సీతమ్మవీధి తదితర ప్రాంతాల వారు భారీసైజులో ఏనుగు, హంస బొమ్మలను తయారు చేసి, సంబరాలు చేసేవారు. ఇటీవల నీలయ్యతోట, ఎస్సీ కాలనీ, రామకంచిరాజు నగర్‌ కాలనీ వాసులు ఈ బొమ్మలను రూపొందించి, చేస్తున్న సంబరాలతో పండగ శోభ ఇనుమడించింది. ఏనుగు, హంస వాహనాలకు ఎదురుగా బ్యాండ్‌మేళాలు, లక్కగుర్రాలు, తప్పెట గుళ్లు, కోలాటం, కోయడ్యాన్సులు, వెలుగు బంట్ల నృత్యాలు, కరాటే, ట్రాక్టర్లపై వేషాలు వంటి కార్యక్రమాలతో తెల్లవార్లూ గ్రామంలో సంబరం జరుపుతారు.

గ్రామం సుభిక్షంగా ఉండాలని..

గ్రామంలో ఊరేగిన అనంతరం తెల్లవారుజామున సంబరం మొత్తం గ్రామ ప్రధాన రహదారిపైకి చేరుతుంది. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రధాన రహదారిపై ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి, జమ్మిపత్రితో శమీపూజ చేస్తారు.





భక్తులతో ఆలయాలు కిటకిట

- వివిధ అలంకరణల్లో అమ్మవారు



శ్రీపీఠంలో మహంకాళి అమ్మవారిగా..



శుంభ, నిశుంభల వధ అలంకరణలో పర్వతవర్ధినీదేవి



కరప మార్కెట్‌ సెంటర్‌ వద్ద దుర్గాదేవి అమ్మవారు



దేవాలయం వీధిలోని బాలా త్రిపురసుందరి అమ్మవారు

బోట్‌క్లబ్‌: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మహార్నవమి సందర్భంగా ఆదివారం ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో మహిషాసురమర్ధిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు చాముండేశ్వరీ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయంలో నవావర్ణార్చన, కుంకుమపూజ నిర్వహించారు. స్థానిక భానుగుడి భాను లింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరీదేవి.. దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి కుంకుమపూజలు జరిగాయి. స్థానిక రిజర్వ్‌లైన్‌ అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకులు విశేష పూజలు జరిపారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

ట్రెజరీకాలనీలో ఉన్న విజయదుర్గా అమ్మవారి 39వ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. విచిత్ర వేషధారణలు, పగటి వేషాలు, గరగనృత్యాలు, చెండైమేళం, భద్రకాళీ అవతారాలు, బేతాళ అవతారం, బ్యాండుమేళంతో జరిగిన ఊరేగింపు ఆద్యంతం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్‌ పిడకా శేషు, సభ్యులు పిడక నరసింహమూర్తి, గాలి శివయ్య, కోకా వెంకటగిరి, కోకా సత్తిబాబు, నక్కా శ్రీహరి, గాలి గోవిందు, హరీష్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ తలాటం హరీష్‌ పాల్గొన్నారు.

మహంకాళిగా ఐశ్వర్యాంబిక అమ్మవారు

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు మహంకాళీ మాతగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా దుర్గాష్టమి పూజలు

కరప: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలో ఉన్న వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో దుర్గాష్టమి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కరప, వలసపాకల, కొరుపల్లి, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, జెడ్‌.భావారం, నడకుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, వేళంగి, పెద్దాపురప్పాడు, వాకాడ, యండమూరు, పెనుగుదురు, వేములవాడ, కూరాడ తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో, పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు కొంపెల్ల చక్రధర్‌ పూజలు నిర్వహించారు. కరప శివాలయంలోని పర్వత వర్ధినీదేవిని శుంభ, నిశుంభలవధ అవతారంగా అలంకరించారు. ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్‌ ప్రత్యేకపూజలు చేశారు. ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప మార్కెట్‌ యార్డు వద్ద విజయదుర్గా ఆటో సంఘ నాయకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కూరాడ దీపాలచెట్టు వద్ద కనకదుర్గాదేవి మందిరం వద్ద అమ్మవారికి అర్చకులు నూకల నరసింహమూర్తి కలశపూజ జరిపారు. పెనుగుదురు, నడకుదురు, వలసపాకల, కొరుపల్లి, కరప గ్రామాల్లో భవానీలు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.



అన్నివిధాలా సర్పవరం ఆలయాభివృద్ధి



వంటశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్‌: నారద మహాముని స్వయంగా ప్రతిష్ఠించిన సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఆలయం వెనుక నూతనంగా నిర్మించిన వంటశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని, అన్నదానానికి హాజరైన భక్తులకు వడ్డన చేశారు. అనంతరం అయ్యప్ప, భవానీ భక్తులకు దీక్షా సమయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రముఖ దేవాలయంగా సర్పవరం ఆలయం ప్రసిద్ధి చెందిందన్నారు. ఆలయం వద్ద గోశాలను అభివృద్ధి చేశామని, ప్రతి ఆదివారం భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నామని చెప్పారు. అయ్యప్ప భక్తుల 41 రోజుల దీక్షకు గ్రామస్తులు నిత్యాన్నదానాన్ని ఆలయం వద్దే ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్‌ పీలా నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పుల్లాచందు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్‌ ప్రభాకరరావు, రాష్ట్ర సివిల్‌సప్లైస్‌ డైరెక్టర్‌ జమ్మలమడుగు నాగమణి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

రూ.80 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్‌: సర్పవరం గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణాలకు, భావనారాయణపురంలో కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. డ్రైనేజీ నిర్మాణాలను పరిశీలించి, అవుట్‌లెట్ల ఏర్పాటుపై ఇంజనీరింగ్‌ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ సర్పవరం గ్రామంలో రూ.80 లక్షలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నామని వివరించారు. గడప గడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి డ్రైనేజీలు, రోడ్ల కోసం వినతులు రావడంతో, వీటి నిర్మాణాలను వేగవంతం చేశామన్నారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. భావనారాయణపురంలో శెట్టిబలిజల కోసం బీసీ కమ్యూనిటీ హాల్‌ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గ్రామ నాయకులు పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, సర్పంచ్‌ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్‌ పుల్ల ప్రభాకరరావు, వార్డు సభ్యుడు చక్రరావు, మండల ఇంజనీర్‌ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వన్నెం మురళి తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా దసరా పోటీల నిర్వహణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్‌ మండలం కొవ్వూరులో దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ రూరల్‌ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు కొవ్వూరు పంచాయతీ ఉప సర్పంచ్‌ పబ్బినీడి రమేష్‌బాబు ఆధ్వర్యంలో తారకరామనగర్‌లో తొలిసారిగా దసరా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రెండు రోజులుగా మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు, మ్యూజికల్‌ చైర్స్‌, టగ్‌ ఆఫ్‌ వార్‌ పోటీలను నిర్వహించారు. పదేళ్లలోపు పిల్లలకు ఫ్యాషన్‌ షోతో పాటు ఆటలు, పాటల పోటీలు జరిపారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్పంచ్‌ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్‌ పబ్బినీడి రమేష్‌బాబు, గుత్తుర్తి సత్య రాజేష్‌, వార్డు మెంబర్లు పి.నూకరాజు, మల్లాడి మల్లేష్‌, పబ్బినీడి చైతన్య, కాకి లక్ష్మి, నూకరాజు, పంతాడి ధర్మారావు తదితరులు బహుమతులు అందజేశారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం : ఎస్పీ



ఎస్పీ సతీష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కోచ్‌ సత్యనారాయణ

నాగమల్లితోట జంక్షన్‌(కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద పార్కులోని తైక్వాండో శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ఇటీవల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు పొందిన క్రీడాకారులను అభినందించారు. వారికి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జునరావు, జిల్లా పీఈటీ సంఘ కార్యదర్శి నూకరాజు, కోచ్‌ సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

కాకినాడ రూరల్‌: దసరా వేడుకల్లో భాగంగా కాకినాడ బీచ్‌ సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన సంగీత విభావరి అలరించింది. కళాకారులు బ్రహ్మానందం, పైల సత్యనారాయణ, వరలక్ష్మి తమ గానమాధుర్యంతో ఆకట్టుకున్నారు. వీరిని శిల్పారామం ఏఓ ప్రకాష్‌ సత్కరించారు.

అపూర్వ కలయిక

కరప: పాతికేళ్ల తర్వాత స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ హైస్కూల్‌లో 1997–98 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకుని సందడి చేశారు. బ్యాచ్‌కు చెందిన పేపకాయల సూరిబాబు, గుండా బాలరాజు, దేవు మాణిక్యాలరావు, బండారు శివ, మేడిశెట్టి రామలింగేశ్వరరావు, పోలిశెట్టి బాపనయ్య, గోన శివ తదితరులు కమిటీగా ఏర్పడి 160 మంది పూర్వ విద్యార్థులు కలిసేలా చేశారు. తమ గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధి ప్రదాత నక్కా సూర్యనారాయణమూర్తితో పాటు అల్లూరి సీతారామరాజు, స్వామివివేకానంద విగ్రహాలకు నివాళులర్పించారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



